
ప్రజాశక్తి

మంగళవారం 6 మే 2025

5

పార్వతీపురం మన్యం



9న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం : స్థానిక భాస్కర్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 9న జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువు కొని 18 నిండి 28 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9177297528, 94947 77553 నందు సంప్రదించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

మన్యంలో విజృంభిస్తున్న జ్వరాలు

- మలేరియా కేసులే ఎక్కువ
- తగ్గుతున్న ప్లేట్లెట్స్
- పిహెచ్‌సిల్లో మందుల కొరత
- ఐదేళ్లుగా అందని దోమతెరలు
- ఆందోళనలో గిరిజనులు



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో ఎపిడిమిక్ సీజన్ ప్రారంభం కాకముందే మన్యంలో మలేరియా వైరల్ పంజా విసిరింది. ప్రతి తండాలో వైరల్ మలేరియా కేసులు చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. ఇటీవల కాలంలో ఎండలు తీవ్రంగా ఉండడం, వడగాల్పుల వేడి, అధిక ఉష్ణోగ్రతలు, మరోవైపు వర్షాలు పడడం, కొత్తనీరు తాగడంతో ప్రతి ఇంట్లోనూ ఒకరో, ఇద్దరో జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైరల్ మలేరియా కేసులు రోజు రోజుకు నమోదవుతున్నాయి. ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాయకమ్మగూడ, కిల్లాడ, దేవనాపురం, ఘాటీ గుమ్మడ, పొల్ల, టిటికిపాయి, తదితర ప్రాంతాల్లో అధికంగా మలేరియా కేసులు ఉన్నాయి. కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కురిసింగి, అచ్చుబ, మర్రిపాడు ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎగువద్వారబంధం గ్రామాల్లో మలేరియా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వైద్యం పొందుతున్నారు. ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రోజుకు 10 మలేరియా కేసులు నమోదవుతున్నాయి. కుసిమి, మర్రిపాడు పిహెచ్‌సిల పరిధిలో వైరల్ జ్వరాలు ప్రతి పిహెచ్‌సిలో పదేసి 10 కేసులు నమోదవుతున్నాయి. సీతంపేట ఏరియా ఆసుపత్రిలో మలేరియా కేసులు సుమారు రోజుకు 15 నుంచి 20 వరకు నమోదు అవుతున్నాయి. అయితే కాగుమానుగూడకు చెందిన సవర తిమ్మేసు, కోసంగి చెందిన బి.చంటి, కాగుమానుగూడ చెందిన జెర్సీ, మర్రిమానుగూడ చెందిన బిడ్డిక రమేష్ మలేరియాతో బాధపడుతూ శనివారం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా మర్రిపాడు చెందిన గరికమ్మ, కురిసింగి చెందిన సిమ్మయ్యనాయుడు, మల్లి చెందిన అనిల్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో మలేరియాతో ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం వస్తున్న మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మలేరియా రోగులకు ప్లేట్లెట్స్ తగ్గడంతో రక్తకణాలు క్షీణించిపోతున్నాయి. వీలైనంతంత వరకు వైద్యం పొందాలి.

పిహెచ్‌సిలో అరకొరగా మలేరియా మందులు

ఏజెన్సీలో మలేరియా విజృంభిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దీనికి తగ్గ మందుల్లేవని తెలుస్తుంది. ఆర్టిసి నెట్ టాబ్లెట్ అయితే పూర్తిగా లేదు. ఇక క్లోరోక్లిన్, ప్రేమిక్లీన్ కేవలం 50 కిట్లు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మందుల కోసం ఇండెంట్ కూడా తీసుకున్నారు. కేసులు పెరిగితే ఆ మందులు చాలవు. ఇక వైద్యులదే చేతి సమురు తగులుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఆసుపత్రుల అభివృద్ధి నిధులు నిల్

ఆసుపత్రి అభివృద్ధి నిధులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత ఏడాదే మార్చిలోపే ఖర్చయిపోయాయి. దీంతో రోగులకు సరిపడా సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి ఉంది. అవసరమైతే మందులు కూడా కొనలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది రోగులకు తగ్గ ఆసుపత్రుల అభివృద్ధి నిధులు రావాల్సి ఉంది.

ఐదేళ్లుగా అందని దోమతెరలు

ఏజెన్సీలో 2021లో దోమతెరలు సరఫరా చేశారు. ఇప్పటి ఐదేళ్లు గడుస్తున్నా దోమతెరలు సరఫరా చేయలేదు. గత ఏడాదికే దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉంది. అధికారులు 4.30లక్షల దోమతెరలు అవసరమని ప్రతిపాదనలు పంపించారు..

మలేరియా తగ్గుముఖానికి చర్యలు



మలేరియా కేసులు మన్యంలో తగ్గించ డానికి చర్యలు తీసుకుంటున్నాం. స్ప్రేయింగ్ ఆపరేషన్ చేయిస్తున్నాం. ఇంటింటి సర్వే చేపడుతాం. ఎసిటి 3000 కిట్లు మందులు సిద్ధంగా ఉన్నాయి. మందులు కొరత లేదు.

ఎస్.భాస్కరరావు,
జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఈనెల 12 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత సంబంధిత అధికారులను కోరారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి.మంజులవీణతో కలిసి ఆమె సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మే 12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఒకేషనల్, జనరల్ గ్రూపుల నుంచి 4,914 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి ఇంటర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సెకండ్ ఇంటర్ పరీక్షలు జరుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, ఇందుకు తగిన విధంగా ఆర్టిసి బస్సులను నడపాలని అన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, నిరంతర విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లు కల్పించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఒఆర్ఎస్, ప్రథమ చికిత్స తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు సెల్‌ఫోన్లు వాడరాదని, 144 సెక్షన్ అమలు చేయాలని తేల్చిచెప్పారు. వివిధ శాఖలకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఆమె ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి డి.మంజులవీణ మాట్లాడుతూ గత పరీక్షల్లో అధికారులు సంపూర్ణ సహకారం అందించి పరీక్షలు సజావుగా జరిగేలా సహకరించారని, అదేవిధంగా సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా సహకారం అందించి సజావుగా జరిగేలా కృషి చేయాలని కోరారు.

సమావేశంలో పోలీస్, పోస్టల్, విద్య, రవాణా, వైద్య ఆరోగ్యం, పంచాయతీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే తన ఎజెండా అని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతుల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించాల్సినవి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు.

వైభవంగా శ్యామలాంబ పండగ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో ఈనెల 18 నుంచి 21 వరకు శ్యామలాంబ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా జరగాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. శ్యామలాంబ అమ్మవారి పండుగల నిర్వహణపై సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, చైర్‌పర్సన్ పి.ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వి.అప్పల నాయుడుతో కలిసి మంత్రి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు సుమారు 11లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పండగ మూడు రోజులు ఎక్కడా విద్యుత్ అంతరాయం ఉండరాదని, ప్రభుత్వపరంగా అందించాల్సిన సహకారాన్ని అందిస్తామని తెలిపారు. 900 మందితో పటిష్ట బందోబస్తు, బారికేడింగు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అలాగే పండుగల రోజుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ వుండాలని, ట్రాఫిక్, వాహనాల పార్కింగుకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ, తహశీల్దార్, కమిషనర్, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకొని కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. 100 మంది పారిశుధ్య కార్మికులతో అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారులు గుంతల్లేని రహదారులకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున తగ్గినన్ని బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పట్టణంలోని 29 వార్డులకు 25 వరకు మంచి నీటి సౌకర్యానికి అంతరాయం లేకుండా చూడాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలు, పానియాలు విక్రయాలు వంటివి లేకుండా ఎక్సయిజ్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, పండుగలు సజావుగా జరిగేలా కషిచేయాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక మాట్లాడుతూ శ్యామలాంబ అమ్మవారి పండుగలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయిస్తామన్నారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్, పారిశుధ్యం, భక్తుల కొరకు ప్రత్యేక క్యూ లైన్లు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను ఆయా శాఖాధికారులతో సమావేశం ఏర్పాటుచేసి విధులు కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖాధికారి ఎస్.రాజారావు, శ్యామలాంబ అమ్మవారి దేవస్థానం ఇఒ టి.రమేష్, మండల ప్రత్యేక అధికారి శివన్నారాయణ, మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు, తహశీల్దార్ ఎన్‌వి రమణ, ఎంపిడిఒ జి.పార్వతి, ఎస్డిపీఓ ఎం.రాంబాబు, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.రవి ప్రసాద్, డిపిఒ టి.కొండలరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, జిల్లా విపత్తుల స్పందన అధికారి కె.శ్రీనుబాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఆయకట్టు రైతుల సమస్యలపై ఈనెల 6న తలపెట్టిన ధర్నాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, రైతు ప్రతినిధి నరసింగపాణి గ్రహి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వారు ఓని, లుంబురు, కోటిపల్లి, విపిరాజుపేట తదితర గ్రామాల రైతులతో మాట్లాడారు. సుమారు 8500 ఎకరాలకు తోటపల్లి ఆయకట్టు భూములకు అనేక ఏళ్లుగా సాగునీరందడం లేదని, ఎందువల్ల అని అడిగితే కాలువలు మరమ్మతులని అధికారులు చెబుతున్నారని, ఇలా ఎంత కాలం? ఎందుకు మరమ్మతులు చేపట్టడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కేటాయించింది రూ.47 కోట్లని, ఈ నిధులు ఉద్యోగుల జీతాలకే సరిపోవడంలేదని, ఇక పని ఏం చేస్తారని ప్రశ్నించారు. ఈ ఏడాది కాలువ మరమ్మతుల పనులు ప్రారంభించలేదని, దీంతో నీరు అందించే పరిస్థితి లేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయరా అంటూ ప్రభుత్వం ప్రశ్నించారు. ఇందుకు రైతులంతా కలిసి రావాలన్నారు. 15 మంది లాస్కర్లకు ఇద్దరే ఉన్నా ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. పెద్దపుటి వద్ద సైఫాన్ పాడైనా మరమ్మతులు చేపట్టలేదన్నారు. రైతులు కదిలితే అన్ని పనులు జరుగుతాయని, ఇందుకు వంశధార, తోటపల్లి నిర్వాసిత రైతులే రుజువు చేశారని అన్నారు. ఈ సమస్యలపై మంగళవారం సబ్‌కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు ముందస్తుగా స్థానిక దుర్గ గుడి వద్దకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

శేషగిరి స్ఫూర్తితో బలమైన ఉద్యమాలు నిర్మించాలి

యుటిఎఫ్ నాయకులు శేషగిరి వర్ధంతి సభలో వక్తలు



'తరుగులేని కీర్తి సిరి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శేషగిరి స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఎన్ఇపికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, కీర్తిశేషులు కోరెడ్ల శేషగిరి 4వ వర్ధంతి సభ స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. తొలుత శేషగిరి చిత్రపటం వద్ద ఆయన కుటుంబ సభ్యులతో పాటు హాజరైన నాయకులంతా నివాళు లర్పించారు. అనంతరం శేషగిరి రాసిన వ్యాసాల సంపుటి 'తరుగులేని కీర్తి సిరి' పుస్తకాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు, నాయకులు కె.విజయగౌరి, డి.రాము తదితరులు ఆవిష్కరించారు. అనంతరం 'భారత ఫెడరలిజం - సవాళ్లు' అనే అంశంపై లక్ష్మణరావు స్మారక ఉపన్యాసం చేశారు. తొలుత జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ స్ఫూర్తిని కలిగిన వ్యక్తి శేషగిరి అని అన్నారు. శేషగిరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే సరైన నివాళి అన్నారు. శేషగిరి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానాని తెలిపారు. అనంతరం శేషగిరి సోదరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి 'తరుగులేని కీర్తి సిరి' పుస్తక పరిచయం చేశారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, ఎన్ఇపి వల్ల రానున్న కాలంలో విద్యా వ్యవస్థ వ్యాపార సరుకుగా ఎలా మారుతుంది, మతతత్వ భావజాలం విద్యా వ్యవస్థలో ఎలా చేరుతుంది, రాబోయే కాలంలో దారితీసే పరిణామాలను వ్యాసాలు ద్వారా ముందుగానే శేషగిరి అంచనా వేసి రాశారని వివరించారు. క్లస్టర్ పాఠశాల విధానం, డిజిటల్ విద్యా విధానం వలన జరిగే నష్టాలను శేషగిరి గతంలోనే వివరించారన్నారు. నేడు ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యంగా మారిందని, అందుకోసం సన్నద్ధం కావాలని తెలిపారు.

అనంతరం మాజీ పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు 'భారతదేశ ఫెడరలిజం-సవాళ్లు' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ యుటిఎఫ్ రూపొందించుకున్న మూడు కర్తవ్యాలను అధ్యయనం, అధ్యాపనం, ఆచరణ అనే మూడు కర్తవ్యాలను అమలు చేసి ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయ నాయకుడు అయ్యారని అన్నారు. మనలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మనకిచ్చిన ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం మన కర్తవ్యమన్నారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ శేషగిరి అంటే ఒక ఉద్యమమని, వర్గ దృష్టితో ఆలోచించేవారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సమస్యలపై వర్గ దృష్టితో ఆలోచించి ఐక్య ఉద్యమాలను నిర్మించారని అన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ప్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, పండిత్ పరిషత్ నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎపి ఎన్జీవో సంఘం కార్యదర్శి సురేష్, పూర్వ నాయకులు వి.రాజగోపాల్, యుటి ఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్, ఎపిటి ఎఫ్ జిల్లా కార్యదర్శిపైడిరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనసూయ, కవి చలం శేషగిరిలో ఉన్న పోరాట పటిమ, ఉద్యమ స్ఫూర్తిని వివరించారు. సభలో శేషగిరి అన్నయ్య తిరుపతిరావు శేషగిరి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి మరో మూడు లక్షలు ప్రకటించారు. సభలో శేషగిరి కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

127 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

అక్రమంగా తరలిస్తున్న 127 కేజీలు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం సాలూరు సిఐ పి.రామకృష్ణ పాచిపెంట పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పాచిపెంట మండలం పద్మాపురం జంక్షన్ వద్ద ఒక కారు అనుమానాస్పదంగా ఆగి ఉందని విఆర్ఒ రామారావు సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్సై వెంకటసురేష్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని కారును తనిఖీ చేయగా, నాలుగు బ్యాగుల్లో సుమారు రూ.12 లక్షలు విలువచేసే 127 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేయంగా దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తులు పరారయ్యారని, కారును సీజ్ చేసినట్లు తెలిపారు. గత నాలుగు నెలల్లో సుమారు 1664 కేజీల గంజాయిని ఎస్సై వెంకట్ సురేష్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు



స్వాధీనం చేసుకున్న గంజాయితో సిఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది

పిజిఆర్ఎస్‌కు 98 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా అధికారులు పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, పరిష్కారంలో అర్జీలు రీఓపెన్ కారాదని అధికారులను కోరారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి భాగస్వామ్యమై 98 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యత గల ఎండార్స్ మెంట్ అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు, ఐసిడిఎస్ పీడీలు వై. సత్యంనాయుడు, డా.టి.కనక దుర్గ, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్ కిరణ్ కు లాప్ ట్యాప్ పంపిణీ

సాలూరు మండలం శివరాంపురానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు అల్లు ఉదయ్ కిరణ్‌కు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా సుమారు రూ:33 వేలు విలువైన ల్యాప్‌ట్యాప్‌ను డిఆర్ఒ కె.హేమలత చేతుల మీదుగా సోమవారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో అందజేశారు. కడప జిల్లా డా:వై.యస్.ఆర్. ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న ఎ.ఉదయ్ కిరణ్ మూగ, చెవుడుతో బాధపడుతూ అభ్యసిస్తున్నాడు. తన చదువుకు, ఉపాధికి ల్యాప్ ట్యాప్ మంజూరు చేయాలని కోరగా, అతనికి సోమవారం ల్యాప్ ట్యాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ డా: పి.ధర్మారెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తి, వికలాంగుల సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉదయ్ కిరణ్ కు లాప్ ట్యాప్ అందజేస్తున్న డిఆర్ఒ హేమలత

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి : డిఆర్ఒ


ఎస్‌పి కార్యాలయంలో....

పార్వతీపురం రూరల్ : ప్రజా సమస్య వేదిక ఫిర్యాదుదారులో వచ్చిన సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వి మాధవ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 14 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బీ ఎస్సైలు ఫ్రకృద్దీన్, జగదీష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌గా మల్లేశ్వరి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోట దుర్గ ఆలయం నుండి స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి అక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని, తాను పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. మల్లేశ్వరి మాట్లాడుతూ చైర్మన్‌గా ఎన్నికైనందునందుకు తన సహకరించిన ఎమ్మెల్యే కౌన్సిలర్లు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, కమిషనర్ రత్నంరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, ఆకుల కుమార్ తదితరులు ఉన్నారు. అయితే వైసిపి కౌన్సిలర్లు ఈ ప్రమాణస్వీకారానికి హాజరు కాలేదు.



చైర్‌పర్సన్ మల్లేశ్వరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు చేసుకోండి

ప్రజాశక్తి - భామిని

అర్హులైన పేదలు ఇంటి స్థలం కోసం స్థానిక సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ ఎస్.శివన్నారాయణ తెలిపారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునే వారికి గతంలో ప్రభుత్వ నుండి ఎటువంటి ఇంటి స్థలం మంజూరు అయి ఉండకూడదన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో ఇంటి స్థలం లేని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మక్కువ: ప్రభుత్వం చేపడుతున్న అందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఇల్లు లేని నిరుపేదలు ఆన్లైన్లో స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకొనే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

శ్యామలాంబ అమ్మవారి పండుగ సందర్భంగా పట్టణంలో 11 కెవి పరిధిలో గల డబ్బివీధి, వెంకటేశ్వర కాలనీ, పిఎన్ బొడ్డవలస, బంగారమ్మ పేట, ఆఫీసియల్ కాలనీ, కూర్మరాజుపేట, జైపూర్ రోడ్, శివాలయం వీధి, కొంకి వీధి, బార్కసు వీధి, చిన బజార్, ఆగురు వీధి, మెయిన్ రోడ్, కన్యాకాపరమేశ్వరి కోవెల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనికోసం వినియోగదారులు విద్యుత్ శాఖ వారికీ సహకరించాలని ట్రాన్స్ కో ఇఇ వేణుగోపాలరావు నాయుడు కోరారు.

కంతపోలమ్మతల్లిని దర్శించుకొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బగ్గందొరవలస కంతపోలమ్మతల్లి గ్రామదేవతను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సోమవారం దర్శించుకున్నారు. ఈ గ్రామ దేవత పండగ సందర్భంగా అమ్మవారి ఘటాలను దర్శించుకొని, వాటిలో పండ్లు, పుష్పాలు సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవత కమిటీకి తన వంతు విరాళంగా రూ.20వేలు నగదును అందజేశారు. అనంతరం గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణరావు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపాన గల మూలిగూడ జంక్షన్ వద్ద ఎస్సై పి.నారాయణరావు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనిటువంటి వాహనదారులకు అపరాధ రుసుం వేసి అనంతరం రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మద్యం సేవించకుండా వాహనాల నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు పరిశీలన

ప్రజాశక్తి- సీతంపేట

ఇటీవల పదో తరగతిలో తప్పిన విద్యార్థులు కోసం బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగుతులను ఎపిఒ చిన్నబాబు సోమవారం పరిశీలించారు. తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించి సూక్ష్మ పరీక్షల నిర్వహణకు తగు సూచనలు ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులను చక్కగా సద్వినియోగం చేసుకొని మే 19 నుంచి జరగబోయే పరీక్షల్లో బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు చెప్పారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, వసంతలక్ష్మి, విషయ నిపుణులు ఉన్నారు.



వేతనదారులకు శీతలపానీయాలను అందిస్తున్న కోటేశ్వరరావు

వేతనదారులకు శీతల పానీయాలు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని లంకెల చెరువు, కుమ్మరి బంధ, కిల్లక బంధ చెరువుల్లో పనిచేస్తున్న సుమారు 200 మంది ఉపాధి హామీ వేతనదారులకు కలింగవైశ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు సోమవారం పని ప్రదేశం వద్దకు వెళ్లి శీతల పానీయాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు వేసవి కాలంలో ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తన మనసు చెల్లించి శీతల పానీయాలు అందజేశానన్నారు. ప్రతిరోజు ఇలానే పని వద్దకు వెళ్లి అందజేస్తామని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలో రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు, అధికారులు దృష్టి సారించాలని ఎంపిపి బద్నాన ప్రమీల అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖ, వెలుగు సిబ్బంది సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం బాగుండాలంటే రైతే వెన్నుముక అని, రైతులు వ్యవసాయ ఉద్యోగులు అందరూ సమ న్వయంతో పని చేసిన రోజే ప్రకృతి వ్యవసాయం విజయ వంతం అవుతుందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ముఖి సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగులు ఎంత శ్రమ పడుతున్నా ప్రకృతి వ్యవసాయ పరంగా రైతులలో స్పందన తక్కువగా ఉందని, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే గ్రామస్థాయి ప్రణాళికలు అవసరమని, రాబోయే రోజులలో ప్రజా ప్రతినిధులను అందరినీ సమన్వయం చేసుకొని ప్రకృతి వ్యవ సాయ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. పాంచాలి సర్పంచ్ గూడపు యుగంధర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసి ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చిన రైతులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసి దండి ఏడుకొండలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శారద, రైతు గోనాపు రామారావును, వెలుగు సిసి రామకృష్ణ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు దేవానంద్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



రాష్ట్రంలోని ఏలూరులో ఈ నెల 10,11న అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి మండల కేంద్రానికి చెందిన రచయిత పాలక దేవానంద్‌ను శ్రీశ్రీ కళా వేదిక సంస్థ అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్ ఆహ్వానించారు. ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందని దేవానంద్ తెలిపారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - భామిని

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పాలకొండ ఎమ్మెలే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక కెజిబివి ఆవరణలో రూ.225.50లక్షలతో కెజిబివి జూనియర్ కళాశాల అదనపు వసతులు నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు నిర్లక్ష్యంతో భామినిలో అస్తవ్యస్తంగా వున్న భామిని-ఆలికాం ప్రధాన రహదారికి కూటమి ప్రభుత్వం రాగానే నిధులు కేటాయించి, రోడ్డు పనులు పూర్తి చేశామని తెలిపారు. దీంతో మండల ప్రజలు ప్రశాంతంగా రోడ్డుపై ప్రయాణం సాగిస్తున్నారని, ఈ అంశం చెప్పడానికి తనకు చాలా ఆనందంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఘనసారా నుంచి కేసరి, కొసలి వరకు రూ.1.50 కోట్ల నాబార్డ్ నిధులతో తారు రోడ్డు మంజూరైం దన్నారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలో 80 శాతం పూర్తి చేసిన కొండలోయ గెడ్డ రిజర్వాయర్ పనులను, కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయాలని టిడిపి నాయకులు ఎమ్మెల్యేను కోరారు. స్థానికంగా చేపట్టవలసిన అభివృద్ధి అంశాలపై ఎప్పటికప్పుడు సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసు కువెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ సంధ్యారాణి, టిడిపి మండలి అధ్యక్షులు రవి నాయుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనం దరావు, ఎంపిటిసి బి.విష్ణు, భామిని సర్పంచ్ ఎల్. రాజేశ్వరి, టిడిపి నాయకులు బిడ్డికి ప్రసాద్, కోరాడ రవణ, కోరాడ రాజేష్, కొల్ల మధు, నిమ్మల మురళి, కాంట్రాక్టర్ పొగిరి అర్జున్, జనసేన మండలి అధ్యక్షులు రుంకు కిరణ్ పాల్గొన్నారు.



సీతంపేట: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సీతంపేట: పట్టణంలో సమగ్రశిక్ష నిధులు రూ.212.02 లక్షలతో నూతనంగా నిర్మించనున్న కెజిబివి జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జయకృష్ణ శంకుస్థాపనచ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, టిడిపి మండల అధ్యకుడు సవరతోట మోఖలింగం, జనసేన మండల అధ్యకుడు మండంగి విశ్వనాథం ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి లాగిన్ నిలిపివేతపై నిరసన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎ.వెంకంపేటలో ఉపాధి హామీ మేట్ల లాగిన్ నిలిపివేతపై మేట్లు, కూలీలు ఆగ్రహంతో ఊగిపోయారు. నిబంధనలకు విరుద్ధంగా మేట్లును మార్చుతున్నారని, అందువల్లే తమకు లాగిన్ ఇవ్వకుండా ఓ ఇద్దరికి మాత్రమే లాగిన్ ఇచ్చి మిగతా 12 గ్రూపుల వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. టిడిపి నాయకులు కూలీలతో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాలుగు ట్రాక్టర్లతో ఎ.వెంకంపేటలోని కూలీలంతా మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. స్థానిక ఎంపిటిసి దొడ్డి సాయిబాబా, మేట్లు పెంట పార్వతి, దొడ్డి అనూరాధ, దొడ్డి శ్రీధర్ తదితరుల ఆధ్వర్యంలో నిరసన జరిగింది. సెల్‌ఫోన్ పరిజ్ఞానం లేని,60 ఏళ్ల ఓ ఇద్దరు మేట్లును లాగిన్ ఇచ్చి మిగిలిన 12 గ్రూపులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆ ఇద్దరి వ్యక్తులకే లాగిన్ ఇవ్వడం వల్ల వారు రాజకీయం చేస్తున్నారని, వెంటనే వారి లాగిన్ తొలగించాలని కూలీలు డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తా : ఎంపిడిఒ

ఇంతవరకు గ్రామంలో ఇలాంటి సమస్య ఉందని తనకు తెలియదని, వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన వారందర్నీ మేట్లుగా నియామకం చేపట్టి లాగిన్ వచ్చేలా చూస్తానని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి కూలీలకు తెలిపారు. ఎంపిటిసి సాయిబాబా సమక్షంలోనే ఉపాధి హామీ సిబ్బంది ఎపిఒ ఈశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్రావు, ఇసి వెంకటలక్ష్మితో మాట్లాడి పూర్తి వివరాలు తమకు అందజేయాలని ఎంపిడిఒ ఆదేశించారు. అలాగే ఏ విధమైన అర్హత లేకుండా తమపై పెద్దరికం చేస్తున్న ఇద్దరు మేట్లకు కూడా లాగిన్ తొలగించాలని ఈ సందర్భంగా కూలీలు ఎంపిడిఒను కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో ఎస్సై వెంకటరమణ, సిబ్బంది పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించిన కూలీలు



ఎంపిడిఒతో మాట్లాడుతున్న వేతనదారులు

ఉపాధ్యాయ సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని ఎపిటిఎఫ్ యూనియన్ నాయకులు ఆకుల జగదీష్, త్రినాధరావు సోమవారం తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో కొనసాగించి, 6 నుండి 10వ తరగతి వరకు యథావిధిగా ఉన్నత పాఠశాలలో కొనసాగించి ఉపాధ్యా యుల 12వ పిఆర్‌సి నియామకం, మధ్యంతర భృతి, డిఎతదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎపిటిఎఫ్ నాయకులు, పాల్గొన్నారు.

పాలకొండ: ఉపాధ్యాయ సమస్యలు పరిష్క రించాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా ఉపా ధ్యక్షులు బివి రమణ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధా నించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న 6,7 తరగతులున్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6,7,8 తరగతులున్న చోట ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు విధా నాన్ని కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశా లకు సంబంధం లేకుండా ఉండేలా చూడా లన్నారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే నియ మించి ఐఆర్ ప్రకటించా లన్నారు. పెండింగ్లో ఉన్న మూడు డిఎలు తక్షణమే ప్రకటించా లన్నారు. అనంతరం తహశీల్దార్ బాలము రళీకృష్ణకు వినతిని అందజేశారు. కార్యక్ర మంలో ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు శేషపు వాసుదేవరావు, గోగుల సూర్యనా రాయణ, వీరఘట్టం మండల ప్రధాన కార్యదర్శి ధనంజయరావు, బూర్జ మండల ప్రధాన కార్య దర్శి గణేష్, నాయకులు టి.ఉమామ హేశ్వరరావు, రమేష్ ఉన్నారు.

సాలూరురూరల్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా ఉందని, వీటి కోసం పాలకులు అనేక విధానాలు తీసుకొచ్చి వీటిని శాశ్వతంగా మూసివేయ డానికి పూనుకు న్నారని, ఇటువంటి నిర్ణయాలను ప్రజలంతా తిరస్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లా డుతూ గత ప్రభుత్వంలో 117 జీవోను తెచ్చి విద్యారంగాన్ని అతలాకుతలం చేసి తీవ్ర నష్టాలు చేశారని, అప్పుడు ఆ జీవోను చాలా ఉపాధ్యాయ సంఘాలు తిరస్కరిం చినా వాటిని అమలు చేశారని అన్నారు. విద్యారంగ సమస్యలపై మే 9న జిల్లా కేంద్రాల్లోనూ, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్థానిక తహశీల్దార్ ఎన్‌వి రమణకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ సాలూరు, మక్కువ, పాచిపెంట అధ్యక్షులు ఎం.అక్కురాజు, ఎన్.ధనలక్ష్మి, టి.జనార్దన్, ఎ.తిరుపతిరావు, కార్యదర్శులు సన్యాసిరావు, మోహన్‌రావు, శ్రీనివాస రావు, శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మరిపల్లి పంచాయతీలో గల నేరడమానుగూడ గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైపోయిందని మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి బి.అనిల్ డిమాండ్ చేశారు. పాడైన రోడ్డు వద్ద ఆ గ్రామ గిరిజ నులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మొం డెంఖల్ నుంచి జోడిమానుగూడ, ఇప్పలగుడ్డి గ్రామల వరకు సుమారు 3 కిలోమీటర్లు గత ప్రభుత్వ హయంలో రోడ్డు వేసిన సందర్భంగా నేరడమానుగూడ రహదారి వెంట భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు మొత్తం పాడై, రాళు తేలి ద్విచక్రవాహనాలతో, ఆటోలతో వెళ్లే సమ యంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందో ళన వ్యక్తం చేశారు. కావున ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం తరపున డిమాండ్ చేశారు. ఆది వాసీ గిరిజన సంఘం మండల నాయకులు ఆరిక గంగారావు, ఇండియా పాల్గొన్నారు.

జెసి వ్యాఖ్యలపై కార్యదర్శుల అభ్యంతరం

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో ఈ నెల 2న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులపై జిల్లా జాయింట్ కలెక్టర్ చేసిన వ్యాఖ్యలపై పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరికి జేసీ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరుతూ పంచాయతీ కార్యద ర్శుల సంఘం మండల అధ్యక్షులు వై.వెంకటనాయుడు ఆధ్వర్య ంలో కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాల యాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత వచ్చే వరకు తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలో సంబంధించిన విధులు మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం. ధనుంజయ, బి.చంటి, ఆనంద్ పాల్గొన్నారు.



కురుపాం: ఎంపిడిఒకు వినతినిస్తున్న ఉద్యోగులు

వీరఘట్టం: జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక ఈ నెల 2న పంచాయతీ కార్యదర్శులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఎఒ డి.వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ప్రతి సర్వేలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, మహిళా పోలీసులు తప్ప మిగిలిన శాఖకు సంబంధించిన అధికా రులు సర్వేలు చేయడంలేదని, పని చేసే వారిని కించపర్చేలా మాట్లాడడం సరికాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బంగారు బాబు, కోటేశ్వరరావు, చక్రధర్, అప్పలరాజు, రాంబాబు, శివ, పాల్గొన్నారు.




వీరఘట్టం: ఎంపిడిఒ కార్యాలయం వద్దన నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

కొమరాడ : జాయింట్ కలెక్టర్ వ్యాఖ్యలపై మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధికారుల నుండి గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత వచ్చే వరకు గ్రామపంచాయతీ విధులు, సచివాలయ పరిధిలో తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని పనులు మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్న కార్యదర్శులపై ఉన్నత అధికారులు ఒత్తిళ్లు చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదని అన్నారు. వ్యక్తిగతంగా దూషించడం, మాట్లాడడంపై ఉద్యోగులంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగోన్నతి కల్పించండి

ప్రజాశక్తి - సాలూరురూరల్



మంత్రికి వినతి పత్రాన్ని అందిస్తున్న ఉద్యోగులు

గత ఐదున్నరేళ్లుగా గ్రామ సచివాలయ వ్యవస్థలో ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందజేస్తూ నిరంతరం ప్రజలందరికీ అందుబాటులో ఉండి పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నత కల్పించాలని కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతి పత్రం ద్వారా తమ సమస్యలను తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందజేసే అన్ని రకాల పథకాలను ప్రజలకు చేరువచేయడంలో ప్రధాన భూమికంగా పనిచేస్తున్నామన్నారు. కానీ సచివాలయ వ్యవస్థలో తమతో పాటే ఉద్యోగం నిర్వహిస్తున్న వ్యవసాయ, హార్టికల్చరల్, ఎఎన్ఎం మొదలగు ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం జీవోలు ఇచ్చిందన్నారు. కానీ డిగ్రీలు, పీజీలు, ఉన్నత విద్యావంతులైన వెల్ఫేర్ అసిస్టెంట్లకు కనీసం పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని ఈ విధానం వల్ల జీతాలు విషయంలో కూడా వారి కంటే చాలా తక్కువగానే వస్తున్నాయని, ప్రమోషన్లు లేకపోగా జీతాలు కూడా పెరగకపోవడంతో తమ జీవన వ్యవస్థ కూడా దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను సాంఘిక, వెనుకబడిన తరగతులు, గిరిజన, వికలాంగుల సంక్షేమ వ్యవస్థలో పదోన్నతులు కల్పించాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ మీకు రావాల్సిన ప్రమోషన్లు గురించి సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రికి తెలియజేసి మీ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయడానికి తనవంతు ప్రయత్నాలు సాగిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు వికాస్, నాయుడు, లవన్ కుమార్, సతీష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 26 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌కు 26 వినతలు వచ్చాయి. పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. మేడ ఒబ్బంగికి చెందిన సుబ్బారావు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. లాడకు చెందిన ప్రసాద్ సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, అనంతగిరికి చెందిన రామారావు జిసిసి ద్వారా కొండచీపుర్లు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, పిహెచ్ఒ గణేష్, సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పై దృష్టి సారించండి

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మున్సిపాలిటీ పాలనపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హేమలతతో కాంగ్రెస్ పార్టీ ఒబిసి పార్వతిపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పార్వతీపురం మున్సిపాలిటీ పరిపాలనపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదన్నారు. బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించ లేదన్నారు. దీంతో మున్సిపాలిటీలో ఆర్థికపరమైన అభివృద్ధి పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్ల మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు ఇటీవల పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయన్నారు. వారిద్దరి మధ్య సమన్వయం కూడా మున్సిపల్ పాలనకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా వారానికి ఒకరోజు కుళాయిలు రావడం జరుగుతుందనీ, దీని వల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీలో చెత్త నుండి సంపద తయారీ జరగటం లేదని, చెత్త సాగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ తదితర కార్యక్రమాలు జరగటం లేదన్నారు. అవన్నీ జరిగేలా చర్యలు తీసుకొని, మున్సిపాలిటీలో పాలన సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్‌డిఒ హేమలత తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లను ఆదేశించారు.



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి

హత్యేనంటున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-సీతానగరం



మండలంలోని బల్లకృష్ణ రాయపురంలో సోమవారం బొత్స రమణమ్మ (75) అను మానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పార్వతీపురం సిఐ గోవిందరావు కథనం ప్రకారం.. రమణమ్మ తన కుమార్తె లక్ష్మి కలిసి ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి కుమార్తె తన బంధువుల ఇంట్లో నిద్రించడానికి వెళ్ళింది. రమణమ్మ ఒక్కరే ఒంటరిగా ఇంట్లో నిద్రించింది. సోమవారం తెల్లవారి లక్ష్మీ తన ఇంటికి వచ్చి తల్లిని నిద్రలేపగా విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించింది. రమణమ్మకు మెడ నొప్పి కారణంగా మెడకు బెల్టు వేసుకొని నిద్రిస్తుం టుంది. అందువల్లే తన తల్లి చనిపోయిందని తొలుత కుమార్తె భావించింది. తన తల్లిని ఎవరో గొంతునులిమి హత్య చేశారని ఆరోపించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ గోవిందరావు ఆధ్వర్యంలో ఇన్చార్జి ఎస్ఐ నీలకంఠం, సిబ్బంది, క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో సోమవారం రెండు పూరిళ్ళు దగ్ధమయ్యాయి. ఈ మేరకు గ్రామానికి చెందిన జక్కువ కంచమ్మ, ముడిదాపు నాగభూషణలకు చెందిన రెండు పూరిళ్ల అగ్నికి ఆహుతయ్యాయి. పూరిళ్ల నుంచి ఒక్కసారిగా మంటలు చెల రేగడంతో ఇంటిలో ఉన్న వస్తువులు ఏమీ తీయలేకపోయామని అగ్ని ప్రమాద బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాద విషయాన్ని తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్తి నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించ నున్నామని మండల రెవెన్యూ పరిశీలకులు ఎస్ఎస్‌జి ప్రసాదరావు తెలిపారు.

జనసేన కిట్లు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్ గ్రామంలో జనసేన మండల అధ్యక్షులు నేరేడుబిల్లి వంశీ సోమవారం జనసేన సభ్యత్వ నమోదు చేసుకున్న సైనికులకు జనసేన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇటీవల జనసేన సభ్యత్వంలో నమోదు చేసుకున్న కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లతో కూడిన కిట్లను ఇంటింటికి వెళ్లి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు గండిమని అజయ్, డోలు శివప్రసాద్, గుల్ల తిరుపతిరావు, నరేష్, సంకు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'హాయ్'తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - వీరఘట్టం

వాట్సాప్‌లో హాయ్ అంటే మనమిత్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు పొందవచ్చునని ఎంపిడిఒ బి.వెంకటరమణ చెప్పారు. సోమ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మన మిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వ సేవల కార్యక్రమంలో భాగంగా సేవల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 250 రకాలైన సర్వీసు లను వీటి ద్వారా అర్జీదారులకు అందజేస్తు న్నామన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ వినియో గించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ ఎంపిడిఒ టి.వెంకట రమణమూర్తి, సీనియర్, జూనియర్ సహాయ కులు వి. శ్రీనివాసరావు, ఏ శ్రీకాంత్, టైపిస్టు మూర్తి, పి భాస్కరరావు, ఉమామహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

కింతలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామ పెద్ద కింతల పాండురంగను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల బైక్ ఢీ కోవడంతో ఆయనకు కాలు విరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.